పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్ కలెక్టరేట్, మార్చి 4 : బేగంపేట్, రామంతాపూర్ పబ్లిక్ స్కూల్స్‌లో 1వ తరగతి ప్రవేశానికి గిరిజన బాల బాలికలు 2024-25 సంవత్సరానికి దరఖాస్తు చేసుకోవాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తు ఫారాలు లభిస్తాయిని, పూర్తి చేసిన దరఖాస్తులను మార్చి 11వ తేదీలోపు అందజేయాలని చెప్పారు. అర్హులైన దరఖాస్తుదారులకు మార్చి 14వ తేదీన కలెక్టరేట్ ప్రజావాణి హాల్‌లో లాటరీ నిర్వహించి ఎంపిక చేస్తారని అన్నారు. ఇతర వివరాలకు జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

తెలుగు యూనివర్సిటీ, మార్చి 4 : సంగీతం, సాహిత్యం, నృత్యం, క్రీడలు, యోగా, ఉపాధ్యాయ, ఆధ్యాత్మికం తదితర రంగాలలో రాణిస్తున్న వారు ఉగాది పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ ఈ.ఎస్.ఎస్ నారాయణ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మార్చి15వ తేదీలోగా 9652347207 నంబర్‌లో సంప్రదించి పంపించాలని ఆయన సూచించారు. ఏప్రిల్ 7న ఉగాది పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు.

తెలుగు తేజం, తెలంగాణ తేజం పురస్కారాలకు..

శిఖరం ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని న్యూ ఢిల్లీలో ఏప్రిల్ 29న ఉగాది జాతీయ నంది పురస్కారాలు, తెలుగు తేజం, తెలంగాణ తేజం పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు శిఖరం కార్యదర్శి జి.కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విభిన్న రంగాలలో రాణిస్తున్న వారు ఈ పురస్కారాలకు మార్చి 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9494523562 సంప్రదించాలని తెలిపారు.

అర్బన్ పార్కులు.. ఆక్సిజన్ ఫ్యాక్టరీలు

- మేడ్చల్ జిల్లాలో బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో 15 అర్బన్ పార్కులు ఏర్పాటు
- త్వరలోనే యాధ్గర్‌పల్లి, గౌడవెల్లిలో అందుబాటులోకి
- మరిన్ని ఏర్పాటు చేసేందుకు అటవీ అధికారుల ప్రతిపాదనలు
- హరితహారం కార్యక్రమంలో లక్ష మొక్కలు నాటడమే లక్ష్యం

మేడ్చల్, మార్చి 4 (నమస్తే తెలంగాణ) : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మరిన్ని పార్కుల ఏర్పాటుకు అటవీశాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. హైదరాబాద్ నగరానికి సమీపంలో ఉన్న మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా పచ్చదనం పెంపునకు అటవీశాఖ చర్యలు చేపట్టింది. జిల్లాలో 8093.38 హెక్టార్ల అటవీ భూమి ఉండగా.. ఇందులో 40 ఫారెస్ట్ బ్లాకులు ఉన్నాయి. నగరంలో పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వందలాది ఎకరాల్లో 15 అర్బన్ పార్కులు ఏర్పాటు చేయగా.. యాధ్గర్‌పల్లి, గౌడవెల్లిలో నూతనంగా నిర్మిస్తున్న అర్బన్ పార్కులు త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన అర్బన్ పార్కుల నగర ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. వాకింగ్ ట్రాక్‌లు, సైకిల్ ట్రాక్‌లు ప్రజలకు సౌకర్యవంతంగా మారాయి. దీంతో పాటు మరిన్ని అర్బన్ పార్కుల ఏర్పాటుకు అనుకూలంగా ఉన్న అటవీ భూములను గుర్తిస్తున్నారు.

అర్బన్ పార్కులలో లక్ష మొక్కలు

వచ్చే హరితహారం కార్యక్రమంలో అర్బన్ పార్కులలో లక్ష మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. హరితహారం కార్యక్రమంలో నాటిన మొక్కలు 90 శాతం పెరిగి వృక్షాలుగా మారినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం అర్బన్ పార్క్‌లలో లక్ష మొక్కలు నాటేందుకు మాత్రమే స్థలం ఉన్నదని పేర్కొన్నారు.

సమావేశంలో పాల్గొన్న జైగౌడ్ ఉద్యమ కమిటీ ప్రతినిధులు

పాపన్న చరిత్రను సీబీఎస్ఈలో చేర్చాలి

జై గౌడ్ ఉద్యమం జాతీయ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ వట్టికూటి రామారావుగౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 4 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సర్దార్ సర్వాయి పాపన్న మహారాజ్ చరిత్రపై నిర్లక్ష్యం వహిస్తే తగిన గుణపాఠం చెబుతామని జైగౌడ్ ఉద్యమం జాతీయ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ వట్టికూటి రామారావుగౌడ్ హెచ్చరించారు. జైగౌడ్ ఉద్యమ జాతీయ కమిటీ ప్లీనరీని ఉస్మానియా యూనివర్సిటీలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామారావుగౌడ్ హాజరై ప్రసంగించారు. దేశవ్యాప్తంగా 12కోట్ల మంది జనాభా కలిగిన గౌడ్‌లకు పరిపాలన, వృత్తి రక్షణలో అన్యాయం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. గౌడ్‌లకు తక్షణమే బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. పాపన్న మహారాజ్ చరిత్రను పాఠ్యాంశంగా సీబీఎస్ఈ సిలబస్‌లో చేర్చాలని కోరారు. లేనిపక్షంలో భవిష్యత్ ప్రణాళిక ప్రకటిస్తామని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా చిట్టిబొమ్మ కిశోర్‌గౌడ్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా గుండ్రాతి నారాయణగౌడ్, మహారాష్ట్ర అధ్యక్షుడిగా నారాయణగౌడ్ సిల్లేవార్, చత్తీస్‌ఘడ్ రాష్ట్ర అధ్యక్షుడిగా దీపక్‌గౌడ్ జైస్వాల్, మధ్యప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా మారోతురావ్ రంగ్‌వార్‌గౌడ్, రాష్ట్ర అధ్యక్షురాలిగా గాదగోని విమలగౌడ్, ప్రధాన కార్యదర్శిగా స్వప్నగౌడ్, తెలంగాణ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా మునుకుంట్ల శ్రీనివాస్‌గౌడ్, యూత్ అధ్యక్షుడిగా శంకర్‌గౌడ్ తదితరులు ఎన్నికయ్యారు.

ఇంటర్నేషనల్ ఇంప్లాంట్ కాన్ఫరెన్స్‌లో వికాస్ గౌడ్

జూబ్లీహిల్స్, మార్చి 4 : సెర్బియాలోని ఇంటర్నేషనల్ ఇంప్లాంట్ కాన్ఫరెన్స్‌లో ప్రోస్టో డెంటిస్ట్ డాక్టర్ వికాస్ గౌడ్ పాల్గొని భారతీయ దంత వైద్యంలో విప్లవాత్మక పురోగతిపై పరిశోధనలను ఆవిష్కరించారు. ఈ కాన్ఫరెన్స్‌కు ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల నుంచి సుమారు 400 మంది హాజరుకాగా అందులో ఏకైక భారతీయుడు వికాస్ గౌడ్ కావడం విశేషం.

చేనేత, హస్తకళ ప్రదర్శన పోస్టర్ విడుదల

బొల్లారం, మార్చి 4 : ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో తెలంగాణ ప్రభుత్వ చేనేత, హస్త కళల శాఖ ఆధ్వర్యంలో చేనేత, హస్త కళ ప్రదర్శన నిర్వహించనున్నట్లు రాష్ట్రపతి నిలయం అధికారి రజినీ ప్రియ తెలిపారు. సోమవారం చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుతో కలిసి మంత్రి కార్యాలయంలో ప్రదర్శన పోస్టర్‌ను విడుదల చేశారు.

వస్తు ప్రదర్శనకు విశేష స్పందన

ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న సీడ్బీ జనరల్ మేనేజర్, సీఐఏ అధ్యక్షుడు డాక్టర్ గోవింద్‌రెడ్డి, టీఐఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, మందా సురేశ్‌కుమార్ తదితరులు

చర్లపల్లి, మార్చి 4 : పారిశ్రామికవాడలో ఉత్పత్తి చేసే వస్తువులు తక్కువ ధరకు పొందే విధంగా వస్తు ప్రదర్శన ఏర్పాటు చేయడం హర్షణీయమని సీడ్బీ జనరల్ మేనేజర్ రాజేంద్ర ఆస్థాన పేర్కొన్నారు. చర్లపల్లి పారిశ్రామికవాడలోని సీఐఏ భవనం, ఆడిటోరియంలో సీఐఏ, ఎంఎస్ఎంఈ - 2024 ఎక్స్‌పోను సీఐఏ అధ్యక్షుడు డాక్టర్ గోవింద్‌రెడ్డి, తెలంగాణ పారిశ్రామికవేత్తల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, ఐలా చైర్మన్ రోషిరెడ్డి, పారిశ్రామికవాడల అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, మియాపురం రమేశ్‌లతో కలిసి సోమవారం మూడవ వస్తుప్రదర్శనను ప్రారంభించారు. టీఐఎఫ్ రాష్ట్ర నాయకుడు మిరుపాల గోపాల్ రావు, పారిశ్రామిక వేత్తలు చంద్రశేఖర్‌రెడ్డి, మందా సురేశ్‌కుమార్, జీఎస్.రెడ్డి, మోహన్, మూర్తి, ఎస్ఆర్‌సీ.రెడ్డి, గంగాధర్‌బాబు, వినోద్‌కుమార్, దత్తు, రమేశ్, కృష్ణ, రవి, ఆర్ఎల్ ఎన్.రెడ్డి, రాము, శ్రీనివాస్, వెంకట్‌రామిరెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

మల్లారెడ్డిలో టెక్నికల్ ఫెస్ట్ ప్రారంభం

కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ రామస్వామిరెడ్డి, ఎన్.వెంకట్ రెడ్డి తదితరులు

మేడ్చల్, మార్చి 4 : రోబోటిక్స్‌కు బంగారు భవిష్యత్ ఉన్నదని, విద్యార్థులు రోబోటిక్స్‌పై దృష్టి సారించాలని విహాన్ ఎలక్ట్రిక్స్ అండ్ టెక్ టీం సొల్యూషన్స్ సీఈవో, ఫౌండర్ ఎన్.వెంకట్ రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల మెయిన్ క్యాంపస్‌లో సోమవారం టెక్‌నెక్స్ 2కే 24 పేరుతో మూడు రోజులపాటు నిర్వహించనున్న టెక్నికల్ ఫెస్ట్‌ను సోమవారం ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ రామిస్వామి రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హెచ్‌వోడీ పీఎస్ఆర్‌సీ మూర్తి, స్టూడెంట్, ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్లు, హెచ్‌వోడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మలగని బత్తి పుస్తకావిష్కరణ

మలగని బత్తి(నవలాత్రయం)పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

రవీంద్రభారతి, మార్చి 4 : విజ్ఞాన సరోవర ప్రచురణలు, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ఎస్.ఎం.ప్రాణ్‌రావు రచించిన మలగని బత్తి(నవలాత్రయం)పుస్తకాన్ని ప్రొఫెసర్ కోదండరామ్, డా.మామిడి హరికృష్ణ, ప్రముఖ సాహితీవేత్త ఏనుగు నరసింహారెడ్డి ఆవిష్కరించారు. జి.మల్లేశ్వరరెడ్డి , కేపీ అశోక్‌కుమార్, పి.జ్యోతి, చింతపట్ల సుదర్శన్, సుధా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌కు శంకుస్థాపన

సిటీబ్యూరో, మార్చి 4 (నమస్తే తెలంగాణ) : తార్నాకలోని సీఎస్ఐఆర్-ఐఐసీటీలో రానున్న సైన్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను పూర్తిస్థాయి సైన్స్ సిటీగా మార్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉన్నదని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. అందుకు అనుగుణంగా సైన్స్ సిటీకి అనువైన భూమిని కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. 4 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో రూ.41 కోట్లతో నిర్మించనున్న ఈ కేంద్రానికి సోమవారం కేంద్ర సైన్స్, టెక్నాలజీ సహాయ మంత్రి జితేంద్ర సింగ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. సీఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్ ఎన్.కలైసెల్వి, డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ సతీష్ రెడ్డి, సీఎస్ఐఆర్ మాజీ డీజీ శేఖర్ మండే, సాంస్కృతిక శాఖ సంయుక్త కార్యదర్శి ముగ్దా సిన్హా పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా అర్జున్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అర్జున్‌రావు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 4 : తాను చదువుకున్న కళాశాలకే ప్రిన్సిపల్‌గా పనిచేయడం ఎంతో సంతోషంగా ఉన్నదని ప్రొఫెసర్ అర్జున్‌రావు అన్నారు. సోమవారం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన మీడియాతో మాట్లాడారు. 107 ఏళ్ల యూనివర్సిటీ చరిత్రలో ఒక గిరిజన వ్యక్తి ఆర్ట్స్ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా నియమితులవ్వడం ఇదే తొలిసారి అన్నారు. విద్యార్థులు జేఆర్ఎఫ్, నెట్ అర్హత సాధించేందుకు వారికి తగిన ప్రోత్సాహం ఇవ్వడంతో పాటు మార్గనిర్దేశం చేస్తానని చెప్పారు. గ్లోబలైజేషన్ నేపథ్యంలో ఆర్ట్స్, సోషల్ సైన్సెస్ విభాగాలు నిరాదరణకు గురవుతూ, వాటి ఉనికి ప్రమాదంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని అధిగమిస్తూ పూర్వ వైభవం సాధించేందుకు పాఠ్య ప్రణాళికలు మార్చేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు.

500 కోట్లతో గల్ఫ్ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

బహుజన్ ముక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అంసోల లక్ష్మణ్

కవాడిగూడ, మార్చి 4 : రూ.500 కోట్ల బడ్జెట్‌తో గల్ఫ్ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని బహుజన్ ముక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అంసోల లక్ష్మణ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గల్ఫ్ దేశాల్లో చనిపోయిన కార్మికుల కుటుంబానికి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో బహుజన్ ముక్తి పార్టీ ఆధ్వర్యంలో 'గల్ఫ్ సంక్షేమ బోర్డు' ఏర్పాటుకై నిజామాబాద్ పార్లమెంట్(ఎంపీ) అభ్యర్థి దేవతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బహుజన్ ముక్తి పార్టీ అధ్యక్షుడు అంసోల లక్ష్మణ్, నిజామాబాద్ పార్లమెంట్(ఎంపీ) అభ్యర్థి దేవతి శ్రీనివాస్, బీఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు వొలిగి ప్రభాకర్, బీఎంపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ధర్మయ్య, ప్రధాన కార్యదర్శి గుర్రంపాటి శ్యామల్ రాజ్ మాట్లాడుతూ గల్ఫ్ దేశాల్లో టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని, చనిపోయిన కార్మికుల మృతదేహాన్ని రెండు రోజుల్లో ఇంటికి చేరేలా చర్యలు తీసుకోవాలని, ఏజెంట్ల మోసాలను అరికట్టాలని అన్నారు. రాష్ట్రంలో గల్ఫ్ సెంటర్‌లను ఏర్పాటు చేసి, గల్ఫ్ దేశాలకు వెళ్లే వారికి పనిపై అవగాహన కల్పించాలని, అదే విధంగా ట్రైనింగ్ ఏర్పాటు చేసి ఏ కంపెనీకి ఎంత జీతంపై వెళ్తున్నారో అగ్రిమెంట్ చూపించాలని అన్నారు. ప్రభుత్వం నుంచి లైసెన్స్ పొందిన ట్రావెల్స్, ఏజెంట్స్‌కి మాత్రమే అనుమతి ఇవ్వాలని పేర్కొన్నారు. జైళ్లలో మగ్గుతున్న ప్రవాసులకు న్యాయ సహాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎంపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఉప్పులేటి రాజేందర్, ఆలిండియా ఎరుకల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ మేకల దాస్, కేపీ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్షలో మాట్లాడుతున్న బహుజన్ ముక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అంసోల లక్ష్మణ్

పరీక్షా ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 4 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంబీఏ ఈవినింగ్ (నాన్ సీబీసీఎస్), ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్) పరీక్షా ఫలితాలను విడుదల చేశారు. పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఎంసీఏ ప్రాక్టికల్ పరీక్షా తేదీలు ఖరారు

ఓయూ పరిధిలోని ఎంసీఏ మూడో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్, నాలుగో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 14వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

హైలైఫ్ సత్కారం

హైలైఫ్ ఎగ్జిబిషన్ బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న హీరోయిన్లు అశురెడ్డి, ప్రీతికుమార్ తదితరులు

బంజారాహిల్స్, మార్చి 4 : మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10లోని మార్క్స్ మీడియా సెంటర్‌లో సోమవారం సినీ, మోడలింగ్ రంగంలో రాణిస్తున్న పలువురు మహిళలకు హైలైఫ్ సంస్థ తరపున సత్కరించారు. హీరోయిన్లు అశు రెడ్డి, ప్రీతి కుమార్, ప్రియాంక చౌదరితో పాటు మోడల్స్‌ను నిర్వాహకులు మెమెంటోలతో సన్మానించారు. అనంతరం మార్చి 15నుంచి 17వరకు మాదాపూర్‌లోని నోవాటెల్ హోటల్‌లో నిర్వహించనున్న హైలైఫ్ ఎగ్జిబిషన్‌కు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించారు.

అపోలో క్యాన్సర్ సెంటర్‌లో కార్టీ థెరఫీ

జూబ్లీహిల్స్, మార్చి 4: క్యాన్సర్ రోగులకు కార్టీ (కార్-టి) సెల్థెరఫీ ఓ వరమని.. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఎంతోమంది రోగుల జీవితాల్లో వెలుగులు నింపిందని అపోలో క్యాన్సర్ సెంటర్ బీఎంటీ స్పెషలిస్ట్ డాక్టర్ పద్మజా రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 25 వేల మంది రోగులకు వైద్యులు ఈ ప్రక్రియ ద్వారా విజయవంతంగా చికిత్స అందించారన్నారు. కరీంనగర్‌కు చెందిన 50 ఏండ్ల మహిళ మల్టి పుల్మోలోమాతో బాధపడుతూ అపోలో క్యాన్సర్ సెంటర్ చేరారు. పరీక్షించిన వైద్యులు అరుదైన చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అపోలో హాస్పిటల్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీత రెడ్డి మాట్లాడుతూ ప్రపంచస్థాయి టెక్నాలజీ తీసుకురావడంలో అపోలో హాస్పిటల్ ఎప్పుడూ ముందంజలో ఉంటుందన్నారు.

నేడు శ్రీ ఉజ్జయినీ మహంకాళి ఆలయానికి.. ప్రధాని నరేంద్ర మోదీ

బేగంపేట్, మార్చి 4 : భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మంగళవారం ఉదయం 8:30 గంటలకు సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి దేవాలయాన్ని సందర్శించనున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం సంగారెడ్డికి వెళ్లనున్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి నుంచి సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి ఆలయ పరిసరాలను పోలీసులు, కేంద్ర బలగాలు ఆధీనంలోకి తీసుకోనున్నారు. సాయంత్రం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో పాటు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ఏర్పాట్లను పరిశీలించారు.

ఉజ్జయినీ మహంకాళి దేవాలయం వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు

ప్రధానికి స్వాగతం..

సిటీబ్యూరో, మార్చి 4 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర పర్యటనలో భాగంగా నగరానికి చేరుకున్న ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

పతంజలి స్వయం సహాయక సంఘాల రికార్డుల డిజిటలైజేషన్

జూబ్లీహిల్స్, మార్చి 4 : జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ పరిధిలో నెలకొల్పిన స్వయం సహాయక సంఘాల రికార్డుల డిజిటలైజేషన్ వర్క్‌షాప్‌ను సోమవారం ప్రారంభించారు. హరిద్వార్‌లోని పతంజలి విశ్వవిద్యాలయంలో ఉత్తరాఖండ్ స్టేట్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈవర్క్‌షాప్‌ను యూఎస్ఆర్ఎల్ఎం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మనుజ్ గోయల్, జాతీయ మిషన్ మేనేజర్ ప్రభాత్, పతంజలి యోగపీఠ్ సహ వ్యవస్థాపకుడు ఆచార్య బాలకృష్ణతో కలిసి ప్రారంభించారు. పతంజలి నిర్వహణలో చేపడుతున్న ఈ వర్క్‌షాప్‌లో భారత ప్రభుత్వ జాయింట్ సెక్రటరీ స్మృతి శరణ్, డిప్యూటీ సెక్రటరీ నివేదిత ప్రసాద్‌లు లోకోస్ యాప్ ప్రయోజనాలను వివరించారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే ఈ ప్రాంతీయ వర్క్‌షాప్‌లో ఉత్తర్‌ప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, లడక్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్, హర్యానా, అండమాన్-నికోబార్, జమ్మూకాశ్మీర్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలలోని సంఘాలు పాల్గొంటున్నాయి. ఈ వర్క్‌షాప్‌లో ఫైనాన్స్ కంట్రోలర్ భూపేంద్ర ప్రసాద్ కంద్‌పాల్, అడిషనల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రదీప్ కుమార్ పాండే, ఎన్ఆర్ఎల్ఎం, ఎన్ఎంఎంయూ నిర్వాహకులతో పాటు ఎన్ఐఆర్‌డీఅండ్ పీఆర్ నుంచి హైదరాబాద్‌కు చెందిన మాస్టర్ ట్రైనర్స్, యూఎస్ఆర్ఎల్ఎం, జిల్లాస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

అర్చక సంక్షేమం కోసం తీర్మానాలు

సమావేశంలో పాల్గొన్న బోర్డు చైర్మన్ నవీన్‌మిట్టల్, శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, తదితరులు

సుల్తాన్‌బజార్, మార్చి 4 : అర్చక, ఉద్యోగుల సంక్షేమం కోసం అత్యధిక సమయాన్ని వెచ్చించి పూర్తి స్థాయిలో లబ్ధి పొందేలా అర్చక వెల్ఫేర్ బోర్డు సమావేశాన్ని నిర్వహించడం దేవాదాయ శాఖ చరిత్రలో తొలిసారి అని అర్చక వెల్ఫేర్ బోర్డు సభ్యులు, తెలంగాణ దేవాదాయ శాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాండూరి క్రిష్ణమాచారి పేర్కొన్నారు. సోమవారం బొగ్గులకుంటలోని దేవాదాయ శాఖ అర్చక వెల్ఫేర్ బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బోర్డు చైర్మన్ నవీన్‌మిట్టల్, శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, అదనపు కమిషనర్ కృష్ణవేణి, రిటైర్డ్ జడ్జి వామన్‌రావులతో కలిసి అర్చక వెల్ఫేర్ బోర్డు సభ్యులు చిలకమర్రి శ్రావణకుమారాచార్యులు, జక్కాపురం నారాయణ స్వామి, కాండూరి క్రిష్ణమాచారి పాల్గొన్నారు. ఈ సమావేశంలో అర్యక ఉద్యోగుల సంక్షేమం కోసం పలు తీర్మానాలు చేశారు. వెల్ఫేర్ బోర్డు నుంచి హెల్త్ ఇన్సూరెన్స్ కోసం అర్చక ఉద్యోగుల డాటాను కలెక్ట్ చేయాలని, 50 వేల వేతనాలలోపు ఉన్న వారికి మొదటి సమావేశంలో వర్తింపచేయాలని తీర్మానం చేశారు. గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా వేతనాలు పొందుతున్న వారికీ లిమిట్ లేకుండా లబ్ధి పొందే విధంగా అర్చక వెల్ఫేర్ బోర్డు సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు.